

సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయాలి

● ప్రముఖ సైకాలజిస్ట్, రచయిత మల్లేష్

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసినప్పుడే వారి ఉజ్వల భవిష్యత్‌కు మార్గం సుగమవుతుందని, ఇందు కోసం వారిని ప్రోత్సహించాల్సిన అవసరముందని ప్రముఖ సైకాలజిస్ట్, రచయిత మల్లేష్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ ఆధ్వర్యంలో పేరెంట్స్, టీచర్స్ కౌన్సిలింగ్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుంచే వారిలో క్రమశిక్షణతో పాటు మంచి అలవాట్లను నేర్పించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమని అన్నారు. సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పిల్లలకు డబ్బు కంటే సమయం ఇవ్వాలని అప్పుడే వారిలో ఎదుగుదలను చూడవచ్చని అన్నారు. పిల్లలే మన ఆస్తులని వారిని కాపాడుకోవడానికి మంచి పుస్తకాలతో పాటు సమయాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త కడియాల ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బండమైసమ్మనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశన కార్యక్రమంలో సూపర్ వైజర్ బాల, అంగన్‌వాడీ టీచర్లు

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

కవాడిగూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం కవాడిగూడ బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ బాల మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఈనెల 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సూపర్ వైజర్ బాల, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, కవిత, సంతోషిణి, దనమ్మ, స్వప్న, శారద, రఫియా సుల్తానా, ఏఎన్ఎం సుశీల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత కృష్ణగౌడ్

జాబ్ క్యాలెండర్‌ను వ్యతిరేకించడం విడ్డూరం

● తొలుపునూరి కృష్ణాగౌడ్

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జాబ్ క్యాలెండర్‌ను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు జీర్ణించుకోలేక లేనిపోనివిమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణాగౌడ్ ఆరోపించారు. పదేళ్ల కాలంలో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించి కేసీఆర్ ప్రభుత్వం ఒక్క జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదని ఆయన ఆరోపించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్‌ను వ్యతిరేకిస్తే రాష్ట్రంలోని నిరుద్యోగులంతా బీజేపీ బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. బీఆర్ఎస్ , బీజేపీ పార్టీలు ఇప్పటికైనా తమ పద్ధతిని మార్చుకోకపోతే నిరుద్యోగులు, విద్యార్థులు, యువత రాష్ట్రం నుంచి తరిమి కొడతారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు దిలీప్‌కుమార్ నేత, జెల్లి శ్రీమద్ గిరి, తొలుపునూరి నరేష్‌గౌడ్, జితేందర్‌కురమ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో కారు

అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు

హైదర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కారును వెనక్కి తిప్పుతుండగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ నుంచి ప్రగతినగర్ వైపుగా వెళ్తున్న కారు చెరువు ప్రారంభంలో టర్న్ చేసుకునే క్రమంలో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను కాపాడారు. స్థానికుల సహాయంతో యజమాని కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కారులోకి పూర్తిగా నీరు వెళ్లడంతో కారు పాడయింది.

అమరవీరుల స్తూపాన్ని తాకే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

● తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్తూపాన్ని తాకే అర్హత బీఆర్ఎస్‌కు లేదని తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గుర్తుకు రానీ అమరవీరులు స్తూపాన్ని జాబ్ క్యాలెండర్ పేరుతో తాకి మైల చేశారని ఆరోపించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమరువీరుల స్తూపాన్ని పాలతో శుభ్రం చేశామని అన్నారు. గతంలో కేసీఆర్ ఏనాడు అమరవీరులను గౌరవించలేదని, ఉద్యమకారులను అణచివేశాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఉద్యమ నేతలు టి. ప్రఫుల్‌రాంరెడ్డి, రంగారెడ్డి, భీమారావు, కేసీఎస్. ప్రసాద్, ఎం. వెంకటస్వామి, వెంకటనారాయణ, అరుణ, వెంకటలక్ష్మి, లలిత, సుజాత, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

'ఆ యువతి వేధింపుల వల్లే నా భర్త బలవన్మరణం'

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తన భర్త ఆత్మహత్యకు యువతి వేధింపులు, ఆమె కుటుంబ సభ్యులే కారణమని గతనెల 28న రాంనగర్ అచ్చయ్యనగర్‌లో మృతి చెందిన కుమారస్వామి భార్య అఖిల ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను నిగ్గు తేల్చాలని, నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. శనివారం రాంనగర్‌లో తన అత్తమామలతో కలిసి అఖిల మీడియాతో మాట్లాడారు. కుమారస్వామి(26)తో 2019 నవంబర్ 2న తనకు ప్రేమ వివాహం జరిగిందని, అదే ఏడాది డిసెంబర్ 11న పెద్దల సమక్షంలో రెండోసారి పెళ్లి జరిగిందని, తమకు మూడేళ్ల పాప ఉన్నదని తెలిపారు. ఫ్లవర్ డెకరేషన్ పనులు నిర్వహించే కుమారస్వామిని ప్రేమిస్తున్నానని కొంతకాలంగా తమ సమీప బంధువుల కుమార్తె వెంటపడిందని పేర్కొన్నారు. విషయం తెలిసి తన అత్తమామలు ఆ యువతిని మందలించారని, అయినా వినకుండా తన భర్తతో వాట్సప్ చాటింగ్ చేసేదని గుర్తుచేశారు. గతనెల 28న ఆ యువతి నుంచి పలుమార్లు ఫోన్లు రావడంతో ఆయన కంగారుపడి ఆందోళనతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నారని బోరున విలపించారు. తన భర్త ఆత్మహత్యకు ఆ యువతే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆత్మహత్యగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. కాగా, కుమారస్వామి ఫోన్‌కాల్స్, వాట్సప్ చాటింగ్ ఆధారంగా విచారణ చేపట్టామని చిక్కడపల్లి ఎస్ఐ శశిపాల్‌రెడ్డి వివరణ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం



ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందగిరి నర్సింహ తదితరులు



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు స్వీట్లు తినిపిస్తున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు వెంకటేష్ తదితరులు

● ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శనివారం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు మాదిగ దళిత సంఘం నాయకుడు వెంకటేష్ ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వల్ల మాదిగలకు విద్యా, ఉద్యోగ రంగాలలో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు సుధాకర్ గుప్తా, శంకర్‌ముదిరాజ్, మురళి, దామోదర్‌రెడ్డి, రవీందర్, అరుణ్, కళ్యాణ్, శివ, బల్వంత్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రధాని హామీని నెరవేర్చారు

మాదిగల రిజర్వేషన్ పోరాటానికి ప్రధాని నరేంద్రమోదీ మద్దతు ఇవ్వడం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

చట్టం తీసుకురావాలి: సీపీఐ

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని, వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించి చట్టం తీసుకురావాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న డిమాండ్ చేశారు. శనివారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా జరిగిన ప్రతి పోరాటంలో తమ పార్టీ భాగస్వామి అయిందని ఆయన గుర్తు చేశారు. అరెస్టులకు సహితం వెనుకడుగు వేయకుండా పోరాడిందన్నారు.

మాలలను మోసం చేసిన కేంద్రం

● మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకిషన్

కవాడిగూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తీర్పుతో రాష్ట్రంలోని లక్షలాది మంది మాలలను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని తెలంగాణ రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం న్యాయవ్యవస్థను మేనేజ్ చేసి మాదిగలకు తీర్పు అనుకూలంగా వచ్చేట్లు కృషి చేశారని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు కుట్ర ఉందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని బీజేపీ నేతలు భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. సీఎం అసెంబ్లీలో ఒక వర్గానికి అనుకూలంగా మాట్లాడటం సరికాదని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి మాలలంతా కృషి చేసిన విషయాన్ని మరచిపోవద్దని ఆయన గుర్తుచేశారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధం

●మాల మహానాడు రాష్ట్ర నేతలు

నల్లకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, ఈ తీర్పును వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఉద్యమం నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాలుక రాజేష్, మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి మరిపల్లి శ్రీకాంత్, నాయకుడు అనిల్‌కుమార్ వెల్లడించారు. శనివారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ రాజకీయ కుట్రలో రాజ్యాంగం మార్చే కుట్రలో భాగమేనన్నారు. ఎస్సీలకు వర్తింపచేసే రిజర్వేషన్ ఫలాలను కొన్ని ఉప కులాలకు కేటాయించే అధికారం రాష్ట్రాలకు లేదని, లేని అధికారాన్ని రాష్ట్రాలకు కట్టబెట్టడమేమిటని వారు ప్రశ్నించారు. కులాల జనాభా లెక్కలు తేల్చిన తర్వాతనే వర్గీకరణ అమలు చేయాలన్నారు.



కూరగాయల మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

శంకరమఠం ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

● దెబ్బతిన్న ఆటో, స్తంభించిన ట్రాఫిక్

నల్లకుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి నుంచి శంకరమఠం వెళ్లే ప్రధాన రహదారిలో బజాజ్ ఎలక్ట్రానిక్ సమీపంలో శనివారం ఉదయం 11 గంటలకు భారీ వృక్షం కూలింది. ఆటోపై పడడంతో పాక్షికంగా దెబ్బతిన్నది. ఆటోడ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. విద్యానగర్ నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాకు వచ్చే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని చెట్ల కొమ్మలను తొలగించారు. గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. చెట్ల కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



వ్యవస్థాపక దినోత్సవ వేడుకలో ఎన్‌వీఎస్ రెడ్డి తదితరులు

కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● హైదరాబాద్ మెట్రోరైల్వే ఎండీ ఎన్‌వీఎస్‌రెడ్డి

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కామర్స్ విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ మెట్రోరైల్వే మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్‌రెడ్డి అన్నారు. కామర్స్ చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించగలుగుతారని వారిని ప్రోత్సహించాలని ఆయన కోరారు. శనివారం కాచిగూడ బద్రుకా కళాశాల 75 వవ్యవస్థాపక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ సృష్టికర్తలని వారు తయారు చేసిన విద్యార్థులు దేశ అంతర్జాతీయ స్థాయిలో రాణించ గలుతున్నారని ఆయన అన్నారు. బద్రుకా కళాశాల కార్యదర్శి కిషన్ బద్రుక మాట్లాడుతూ కళాశాల వజ్రోత్సవ వేడుకలకు చేరుకోవడం సంతోషకరమన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలి

● బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ బోధనలో భారతీయ ప్రమాణాలను మిళితం చేయాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో స్టాండర్డ్స్ క్లబ్స్‌గా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులకు 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే అంశంపై బీఐఎస్ రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా 10 వేలు, తెలంగాణలో 190 పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విదార్థులకు విభిన్న పోటీల్లో భాగస్వామ్యం చేయడం, భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమల సందర్శనకు తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే కొత్త కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలకు బీఐఎస్ రూపొందించిన పుస్తకాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు రాకేష్, కెవిన్, ఏఎన్ఎస్ శాస్త్రీలు పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.



బీఐఎస్ సైన్స్‌బోధన శిక్షణలో పాల్గొన్న ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులు

నమ్మించి.. తాళాలు డూప్లికేట్ చేసి

● ఓనర్ ఇంట్లో 20 తులాల బంగారం చోరీ

● పోలీసులకు చిక్కిన మహిళ

నిజాంపేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తనకున్న అప్పు తీర్చుకొని సంతోషంగా జీవించాలని అనుకున్న ఓ మహిళ ఆమె అద్దెకుంటున్న ఓనర్ ఇంటికే కన్నం వేసింది. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జర్నలిస్ట్‌కాలనీలో నివాసం ఉండే బడుగు జ్యోతి(27) తాను అద్దెకు ఉంటున్న యజమాని భార్యతో సన్నిహితంగా ఉండేది. ఈ క్రమంలో ఆ ఇంటి తాళం చెవులను డూప్లికేట్ చేయించి తన వద్ద దాచుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనకు మరిది వరుసయ్యే ఇంద్రమ్మకాలనీలో ఉండే జంపని చైతన్యకుమార్(22)తో కలిసి బంగారు నగలు, నగదు చోరీ చేశారు. అయితే, ఇంటి యజమానులు వచ్చి చూసేసరికి ఇంటి తాళం వేసింది వేసినట్టే ఉంది.. కానీ, బీరువాలో దాచిన నగలు, రూ.90 వేల నగదు మాయం కావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ ఉపేందర్‌రావు ఆదేశాల మేరకు డీఐ తిమప్ప ప్రత్యేక టీంతో బంగారు దుకాణాల వద్ద నిఘా పెట్టించారు. ఈ క్రమంలో శనివారం ప్రగతినగర్‌లో బ్యాగుచేతిలో పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని చూడగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. పోలీసులు వారి నుంచి రూ.14 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు రెండేళ్లుగా అదే ఇంట్లో అద్దెకు ఉంటూ వారి కదలికలను గమనిస్తూ చోరీకి పాల్పడిందని పోలీసులు తెలిపారు.

లింక్ ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ

● ఎస్‌బీఐ ఖాతాదారులకు రివార్డు పాయింట్స్ పేరుతో నకిలీ మెసేజ్‌లు

● సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరో కొత్తరకం మోసానికి తెరతీశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారులను లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ పేరుతో ఒక నకిలీ మెసేజ్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. "ప్రియమైన వినియోగదారులారా..! మీ ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు (9980.00) గడువు నేటితో ముగుస్తుంది. వెంటనే ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది." అంటూ నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వచ్చిన మెసేజ్ నిజమని నమ్మి లింక్‌ను ఓపెన్ చేసి ఎస్‌బీఐ రివార్డు యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వెంటనే 'మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు. దాంతో మీఫోన్ కంట్రోలింగ్ వారి చేతికి వెళ్తుంది. ఫోన్‌లో మీరు ఎస్‌బీఐ ఖాతావివరాలు నమోదు చేయగానే వారు ఖాతాలో ఉన్న డబ్బు ఖాళీ చేస్తారు' అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారులు ఈ మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మొద్దని, ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఫోన్‌లో ఓపెన్ చేయొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సైబరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

● శుక్రవారం పట్టుబడ్డ 309 మంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 309 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 261 మంది ద్విచక్రవాహనదారులు, 11 మంది ఆటో డ్రైవర్లు, 36 మంది కార్లు నడిపేవారు. ఒక భారీ వాహన డ్రైవర్ ఉన్నారు. మాదాపూర్‌లో 17 మంది, రాయదుర్గంలో 13 మంది, గచ్చిబౌలిలో ఆరుగురు, నార్సింగ్‌లో 13 మంది, రాజేంద్రగర్‌లో 35మంది, శంషాబాద్‌లో 20 మంది, చేవెళ్లలో 18మంది, షాద్‌నగర్‌లో 10 మంది, మియాపూర్‌లో 52 మంది, కూకట్‌పల్లిలో 13మంది, బాలానగర్‌లో 21 మంది, జీడిమెట్లలో 16 మంది, అల్వాల్‌లో 22 మంది, కేపీహెచ్‌బీలో 8 మంది, మేడ్చల్‌లో 17 మంది, ఆర్‌సీపురంలో 28 మంది డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు.



కవాడిగూడ కల్పనా బస్టాప్ వద్ద బస్సులను పెంచాలని సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

సికింద్రాబాద్ నుంచి నాంపల్లికి మరిన్ని బస్సులు నడపాలి

● సీపీఎం ముషీరాబాద్ కార్యదర్శి దశరథ్

కవాడిగూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి నాంపల్లికి వెళ్లే 20 నంబర్ ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గం కార్యదర్శి మద్దెల దశరథ్ డిమాండ్ చేశారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని కల్పనా బస్టాప్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో దశరథ్ 20 నంబర్ బస్సుల సంఖ్య పెంచాలని, రద్దు చేసిన 45 నంబర్ బస్సును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రయాణికులతో కలిసి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, మహిళా నాయకురాలు విమల, ప్రయాణికులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు తదితరులు

రాజ్యాధికారం కోసం పోరాడుదాం

● దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం దివ్యాంగులందరం పోరాడుదామని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. త్యాగరాయగానసభలో శనివారం తెలంగాణ రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అసెంబ్లీలో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో రాజ్యాధికారం కోసం అందరూ కలిసి పోరాడాలని ఆయన కోరారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హస్తకళాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ పిన్నమనేని సాయిబాబా మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక నాయకులు పి. శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, వెంకటేష్, లక్ష్మి, శంకర్, శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

● గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని రహదారులపై స్పీడ్‌బ్రేకర్లు, కొన్ని చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు అనుమతి కోరుతూ నగర ట్రాఫిక్ పోలీస్ విభాగం అదనపు కమిషనర్ విశ్వప్రసాద్‌కు డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో రోడ్లపై వాహనాలు వేగంగా ప్రయాణిస్తుండడంతో పాదచారులు, సీనియర్ సిటిజన్‌లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్‌బ్రేకర్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అదనపు కమిషనర్ సోమవారం సంబంధిత అధికారులు, వారి సిబ్బందితో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను పర్యవేక్షించి స్పీడ్‌బ్రేకర్లు, సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ వివరించారు. కార్పొరేటర్‌తోపాటు బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు ట్రాఫిక్ అదనపు కమిషనర్‌ను కలిశారు.



తల్లిదండ్రులను సన్మానించిన నిర్వాహకులు

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం

చిక్కడపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఝుమ్మంది నాదం సంస్థ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిక్కడపల్లిలోని శారద స్టూడియోలో తల్లిదండ్రులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయనీగాయకులు తల్లిదండ్రుల ఔన్నత్యాన్ని, వారిపై ప్రేమను ప్రతిబింబించే ఎన్నో మధురమైన గీతాలను ఆలపించారు. కార్యక్రమానికి ఆత్మీయ సహకారం అందించిన కళాపోషకులు ఎల్‌వీఎస్ ప్రసాద్ అభినందనలందుకున్న సంస్థ అధ్యక్షురాలు శుభశ్రావణి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల కోసం అహర్నిశలు శ్రమించి జీవితాన్ని అంకితం చేస్తారని వారికి వృద్ధాప్యంలో తోడుగా ఉండాలన్నారు. మహిళ గొంతుతో పాటలు పాడిన రమేష్ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. రఘు, మహేష్, సుబ్రహ్మణ్యం, గొర్తి చంద్రశేఖర్, రాజ్, రవికొండూరి, చంద్రశేఖర్, వినయ్‌తమ్మినేని, ధనుంజయ్, సూర్య, సుదర్శన్, అపర్ణ, శ్రీలేఖ, ప్రియ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

ఎస్సీల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

5, 6 7 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు

బర్కత్‌పుర, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని పలువురు బీజేపీ నేతలు ఆరోపించారు. శనివారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రభారి డాక్టర్ మనోహర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్‌లో రూ.3500 కోట్ల రూపాయల కోత విధించిందని వారు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈనెల 5, 6, 7 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ఈనెల 17న చేవెళ్లలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు.



సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు డీసీపీ ఇందిర ఆధ్వర్యంలో శనివారం అంబర్‌పేట సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లోని 320 మంది సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపులో ఏసీపీలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, మెడికవర్ ఆస్పత్రి, సౌజన్య డెంటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

\- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)